నమస్తే తెలంగాణ



దివ్యాంగుల క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

# ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- దివ్యాంగుల క్రీడలు ప్రారంభం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 15 : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు సైతం ఆటల్లో పాల్గొని విజయం సాధించాలన్నారు. క్రీడల వల్ల మానసికోల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. అంతకుముందు కలెక్టర్‌కు విద్యార్థులు, దివ్యాంగులు ఘన స్వాగతం పలికారు. క్యారమ్స్, పరుగుపందెం, చెస్, పలు క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రమేశ్, జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీరామ్‌మూర్తి, ఇజాజ్, స్వాతి, మధుసూదన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సట్టి సాయన్న, ఇసాక్ అలీ, సాక్‌పెల్లి సురేందర్, క్రాంతి కుమార్, మహేశ్, శ్రీనివాస్, నర్సయ్య, అమ్జద్, యాదగిరి, రమేశ్‌రెడ్డి, భగవాన్, పుష్ప, సత్యనారాయణ, గంగాధర్, దివ్యాంగులు పాల్గొన్నారు.

# అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి

- జనవరి 12 వరకు 'అకాడమిక్ బబుల్' కార్యక్రమం
- 'తొలిమెట్టు', 'లక్ష్య', 'ఉన్నతి' ద్వారా మెరుగైన విద్య అందించాలి
- పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణ
- కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా అధికారులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 15 : విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని, తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల ద్వారా మెరుగైన విద్య అందించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణ సూచించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ దేవసేన, ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ రాధా రెడ్డితో కలిసి జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల్లో విద్యా సామర్థ్యాలను పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకటి నుంచి ఐదో తరగతి వారికి 'తొలిమెట్టు', ఆరు నుంచి తొమ్మిదో తరగతి వారికి 'ఉన్నతి', పదో తరగతి వారికి 'లక్ష్య' ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాల్లో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. తద్వారా పిల్లలు ప్రతీ సబ్జెక్టులో ప్రతిభ చూపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు ఈ నెల 12 నుంచి 2024 జనవరి 12వ తేదీ వరకు 'అకాడమిక్ బబుల్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి అమలు చేయడం వల్ల విద్యార్థుల్లో ధారాళంగా చదవడం, రాయడం, విషయాల వారి పూర్వ భావనల జ్ఞాన అభ్యాసన ఫలితాలను సాధించవచ్చని వివరించారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా స్కూల్ వివరాలను తెలుసుకొని తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్లు, డీఈవోలకు సూచించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 'తొలిమెట్టు', 'లక్ష్య', 'ఉన్నతి' కార్యక్రమాల ద్వారా పిల్లలకు అత్యుత్తమమైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, జిల్లా విద్యాశాఖ అధికారి టీ ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.

# 'ఆటా' వేడుకలు



వాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

బాసర, డిసెంబర్ 15 : అమెరికా తెలుగు అసోషియేషన్ (ఆటా)ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆర్జీయూకేటీని ఆటా సభ్యులు సందర్శించారు. స్థానిక షాక్ భవనంలో విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో 'ఆటా' వేడుకల చైర్మన్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా మాట్లాడారు. పేదలకు సాయం చేయడంలో ఆనందం ఉంటుందన్నారు. ఇక్కడ వేడుకలు జరుపుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. అమెరికా లాంటి దేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యార్థులకు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆర్జీయూకేటీ నుంచి రెండు శాతం మంది విద్యార్థులు మాత్రమే ఇతర దేశాలకు వెళ్తున్నారని, ఈ శాతాన్ని మరింత పెంచేందుకు 'ఆటా' సభ్యుల సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఉదయం వాకథాన్ కార్యక్రమాన్ని 'ఆటా' ప్రతినిధులతో వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్జీయూకేటీ ప్రాంగణంలోని వీఐపీ గెస్ట్‌హౌస్ నుంచి ఎకో పార్క్ వరకు ర్యాలీ తీశారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు టీషర్టులను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు నగదుతో పాటు బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్జీయూకేటీకి ఆట తమ సేవలను రానున్న రెండేండ్లు అందిస్తుందని అవగాహనా ఒప్పందం రాసుకున్నారు. 'ఆటా' ప్రతినిధులు, ట్రిపుల్‌ఐటీ అధికారులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆటా ప్రతినిధులు

# న్యాయం చేయాలి

- 'మహాలక్ష్మి' పథకానికి వ్యతిరేకంగా ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్ల ర్యాలీ




ర్యాలీ తీస్తున్న ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మీ పథకం వల్ల తమ ఉపాధి దెబ్బతిన్నదని, న్యాయం చేయాలని ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు కోరుతున్నారు. ఈ సందర్భంగా నిర్మల్‌లో భారత్ ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు నిరసన చేపట్టారు. స్థానిక బస్టాండ్ నుంచి ఆటోలతో ర్యాలీ తీశారు. ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తదితరులున్నారు.

# క్యాంప్ కార్యాలయం ముస్తాబు



ముస్తాబవుతున్న క్యాంప్ కార్యాలయం

బోథ్, డిసెంబర్ 15 : బోథ్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ త్వరలోనే క్యాంప్ కార్యాలయానికి వస్తుండడంతో రంగులు వేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేలా క్యాంప్ కార్యాలయం ద్వారా కార్యకలాపాలు నిర్వర్తించే వీలుండడంతో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో సున్నం వేయడం, అవసరమైన సామగ్రి తెప్పించడం వంటి పనులు చేస్తున్నరు. రెండు, మూడు రోజుల్లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చే అవకాశం ఉండడంతో క్యాంప్ కార్యాలయాన్ని సిద్ధం చేస్తున్నారు.

# నేటి నుంచి పీఎం భారత్ వికాసిత్ సంకల్ప్‌యాత్ర



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

- మంచిర్యాల కలెక్టర్ సంతోష్

నస్పూర్, డిసెంబర్ 15 : ప్రధానమంత్రి భారత్ వికాసిత్ సంకల్ప్ యాత్ర శనివారం నుంచి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి జిల్లా అధికారులతో సంకల్ప్ యాత్ర నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్నయోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, విశ్వకర్మ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, సురక్షా బీమా యోజన తదితర పథకాలపై అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. జిల్లాలో రోజుకు రెండు గ్రామాల చొప్పున జనవరి 26 వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టుదలతో ఉన్నత స్థానానికి చేరుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 15 : దివ్యాంగులమని కుంగిపోకుండా పట్టుదలతో చదివి ఉన్నత స్థానానికి చేరుకొని అందరికీ ఆదర్శంగా నిలువాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో శుక్రవారం మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగులను ఉద్దేశించి మాట్లాడారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. చదువుకునేందుకు అవసరమైన పాఠశాలలను అందుబాటులో ఉంచిందన్నారు. అనంతరం దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో కొట్టె చిన్నయ్య, ఆనంద్, దివ్యాంగ సంఘాల నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.